ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 13: రుణ మాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ, మహిళా శక్తి పథకాలపై బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసి రైతులకు నగదు రూపంలో అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్రాలను స్వీకరించాలని, రుణాలను రెన్యువల్ చేసి నగదు అందించాలన్నారు. కొత్త, పాత రుణాల వివరాలను బ్యాంకుల వారీగా అందించాలన్నారు. జిల్లాలో మహిళా శక్తి కేంద్రాల ఏర్పాటు కోసం బ్యాంకర్లు మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందించాలని ఆదేశించారు. 2024-25 సంవత్సరానికి లక్ష్యం రూ.927.27 కోట్లకు గాను ఈ నెల చివరి వరకు రూ.345.47 కోట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.309 కోట్ల గ్రౌండింగ్ పూర్తయినట్లు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో జిల్లాలో 13 రకాల కార్యక్రమాల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరేలా బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో జానకీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ నీరే దిక్కా?

వానకాలంలోనూ నీటి గోస తీరడం లేదు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో తాగు నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోటు వర్షపాతం.. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావులు వట్టిపోయాయి. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారిలా..

- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, ఆగస్టు 13

పెచ్చులూడిన పాఠశాల భవనం పైకప్పు

సిర్గాపూర్, ఆగస్టు 13: మండల పరిధిలోని సుల్తానాబాద్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం వరండాలో మంగళవారం స్లాబు పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ఉపాధ్యాయులు తెలిపారు. భవనం పైన వర్షపు నీరు నిలవడంతో స్లాబు తడిచి పెచ్చులూడి పడినట్లు చెప్పారు. పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉండగా వరండాలో తరగతులు కూడా నిర్వహిస్తారు.

నేను కూడా నీతోపాటే..

ఆత్మహత్య చేసుకున్న యువకుడు

శ్రీహరి(ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 13: బీఫార్మసీ విద్యార్థిని తేజస్విని ఆత్మహత్య ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు శ్రీహరి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగు గ్రామంలో బీఫార్మసీ చదువుతున్న తేజస్విని నాలుగంతస్తుల మేడ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు శ్రీహరి శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మల్లారెడ్డి దవాఖానలో చికిత్స చేయిస్తున్న క్రమంలో మంగళవారం దవాఖాన నుంచి పరారయ్యాడు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి సాయి సొసైటీలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఫోనులో సూసైడ్ నోట్ రాసుకున్నాడు. 'తేజస్విని, నేను ప్రేమించుకున్నాము.. కానీ, కొంత మంది దానికి అడ్డు చెప్పారు. దీంతో తేజస్విని ఆత్మహత్య చేసుకుంది. నేను కూడా నీ దగ్గరికే(తేజస్విని) వస్తున్నాను.. అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలి.' అని తన అక్కకు మెసేజ్ పంపించాడు. ఈ ఘటనపై దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు జాతీయ పతాకం అందజేత

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు జాతీయ పతాకాన్ని అందజేసిన తపాలా శాఖ అధికారులు

సంగారెడ్డి, ఆగస్టు 13: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు జాతీయ పతాకాన్ని అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను తపాలా శాఖ అధికారులు కలిసి పతాకాన్ని అందజేశారు. దేశ సంస్కృతిక, పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఈ నెల 15తో ముగుస్తుంది. కార్యక్రమంలో పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎల్‌వీ మురళీకుమార్, ఆర్‌సీ పురం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పెట్టర్ సావిత్రి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ స్వాగతిక ఫాలో, జహీరాబాద్ సబ్-డివిజన్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్ ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

పటాన్‌చెరు, ఆగస్టు 13: నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి, మరమత్తుల కోసం రూ.60 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలోని గ్రామాల్లో కొత్తగా రోడ్లు మంజూరు చేయాలని కోరారు. మరికొన్ని రోడ్ల మరమ్మతులకు నిధులు కావాలన్నారు. నూతన రహదారుల నిర్మాణానికి రూ.43 కోట్లు, మరమ్మతులకు రూ.17 కోట్లు కావాలని అడిగారు. ఎమ్మెల్యే వినతిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జలమండలి ఎండీని కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం, ఆగస్టు 13: ఆర్సీపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల మంజూరు కోసం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలపై ఇటీవల మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రి సూచనలతో జలమండలి ఎండీని కలిసి సమస్యను వివరించి డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం రూ.5.50 కోట్లు నిధులు అవసరం ఉన్నాయని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన జలమండలి ఎండీ అత్యవసర పనుల్లో భాగంగా యాభై శాతం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో మవీన్‌గౌడ్, పీటర్, సతీశ్ తదితరులు ఉన్నారు.

పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రామచంద్రాపురం, ఆగస్టు 13: రైతులు పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ పొందిన రైతులు తిరిగి సహకార బ్యాంకులో రుణం పొందేందుకు తెల్లాపూర్ పీఏసీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మళ్లీ పంట రుణం కావాల్సిన రైతులు వారి ఆధార్ కార్డు, 1బీ పహాణి, పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలతో పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలల్లో బదిలీలు చేపట్టాలి

ఝరాసంగం, ఆగస్టు 13: కోర్టు కేసులను తొందరగా పరిష్కరించి బదిలీలు చేపట్టాలని టీఎస్ఎంఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ స్కూల్‌లో టీఎస్ఎంఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో బదిలీలు, పదోన్నతులు చేపడుతున్న ప్రభుత్వం ఆదర్శ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు. ఈ నెల 21న ధర్నాచౌక్ వద్ద చేపట్టే నిరాహార దీక్షలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మృతదేహం లభ్యం

బొల్లారం, ఆగస్టు 13: బొల్లారం పారిశ్రామికవాడలోని జెనెక్స్ పరిశ్రమ సమీపంలో ఓ మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అస్రతి కాతూన్(25)గా ఘటనా స్థలంలో లభించిన ఆధార్ కార్డు ద్వారా పోలీసులు గుర్తించారు. మహిళ కాళ్లను బట్టలతో కట్టివేసి గొంతు నులిమి హత్య చేసినట్లుగా తెలుస్తోంది. వెంటనే క్లూస్ టీంను రంగంలోకి దించి హత్యా కోణంలో సమగ్ర విచారణ చేపట్టారు. హత్యకు గురైన మహిళ మిస్సింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 87126 56729 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఫ్యాక్టరీ కాలుష్యంపై గ్రామస్తుల ఆందోళన

అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ

మునిపల్లి, ఆగస్టు 13 : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం గోపులారం సరిహద్దులోని 'ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్' ఫ్యాక్టరీ వదులుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలు, దుర్వాసనను భరించుకోలేక చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొంతమంది సోమవారం అర్ధరాత్రి ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేశారు. ఈ ఫ్యాక్టరీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే తాము ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల 'ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్' ఫ్యాక్టరీ కాలుష్యంపై 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితం కావడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులు స్పందించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న జలాలను ల్యాబ్ పరీక్షల కోసం తీసుకెళ్లారు. కానీ, ఇప్పటి వరకు ఫలితాల వివరాలు వెల్లడించలేదు. 12 రోజుల తర్వాత శాంపిల్స్‌కు సంబంధించి ల్యాబ్ రిపోర్టులు వస్తాయని, వాటి ఆధారంగా ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటామని అప్పట్లో పీసీబీ అధికారులు చెప్పారు. తీరా ల్యాబ్ ఫలితాల వెల్లడి ఆలస్యం అవుతుండడంపై సమీప గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పీసీబీ అధికారులు ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలోని ఓ ప్లాంట్‌ను రెండు రోజుల పాటు నిలిపివేశారు. ప్రస్తుతం ఆ ఫ్యాక్టరీపై చర్యలకు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

కంది: మొక్కలు నాటుతున్న మహిళా సాధికారిత సభ్యులు, ఉపాధ్యాయులు

కంది, ఆగస్టు 13: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయ కర్త పల్లవి పేర్కొన్నారు. మంగళవారం కంది మండలం మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 13: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, కామర్స్ విభాగాల సంయుక్త కార్యాలయంలో మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం వైపు సాగాలి

విద్యార్థులకు టిషర్టులు పంపిణీ చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

మునిపల్లి, ఆగస్టు 13:విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని ఆ దిశగా సాగాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ఖమ్మంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్యూపీఎస్ కంపెనీ సహకారంతో ఉచితంగా టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి ఉన్నారు.

వంట నిర్వాహకుల తొలిగింపు

పాఠశాల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫత్తేపూర్ విద్యార్థుల తల్లిదండ్రులు

కల్హేర్, ఆగస్టు 13: మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో బాధ్యులైన ప్రధానోపాధ్యాయిని జిల్లా విద్యాధికారి సస్పెన్షన్ చేయగా, మధ్యాహ్న భోజన నిర్వాహకులను మండల విద్యాధికారి తొలిగించారు. ఫత్తేపూర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలకు తాళం వేసేందుకు ప్రయత్నించగా బీబీపేట్ గ్రామస్తులు, అధికారులు వారిని శాంతింపజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాములుకు అప్పగించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళశారం ఎంఈవో శంకర్ పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు స్వీకరించారు. వండిన భోజనాన్ని ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం, ఆగస్టు 13: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 8, 12వ వార్డుల్లో సీసీ రోడ్ల పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జ్యోతి థియేటర్ నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కౌన్సిలర్లు బాలమణిరత్నం, ఏఈఈ కిష్టయ్య, ప్రశాంత్, నబీ ఉన్నారు.

'ఓపెన్'లో అడ్మిషన్లు

సిర్గాపూర్, ఆగస్టు 13: సిర్గాపూర్ హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ 2024-25 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్కూల్ కోర్డినేటర్ నాగారం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు నిర్ణీత రుసుముతో, సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 31 వరకు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. చదువుకు దూరమైన వారు, పదోన్నతులకు, పైచదువులకు ఓపెన్ స్కూల్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రెగ్యులర్ చదివిన విద్యార్థులతో సమానంగా సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని తెలిపారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 14న ఉదయం 11 గంటలకు పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. తోషిభా కంపనీలో మొత్తం 100 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వయస్సు 18 నుంచి 25 సంవత్సరాలు ఉండాలన్నారు. నెలకు వేతనం రూ.15 వేలు ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14న స్థానిక బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలోని జిల్లా ఉపాధి ప్రాంగణంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 08455-271010 నంబరుపై సంప్రదించాలని సూచించారు.

అక్రమార్కులపై చర్యలేవి?

పుల్కల్, ఆగస్టు 13: మండల పరిధిలోని గొంగ్లూర్ శివారులో 11 ఎకరాల 12 గుంటల భూమిలో కొంతమంది అక్రమార్కులు కబ్జా చేసి కడీలు పాతారు. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం ఆర్ఐ సయ్యద్ దావూద్, సర్వేయర్ ప్రభాకర్‌లు ఏఎస్ఐ వెంకటేశంతో కలిసి గొంగ్లూర్‌కు వెళ్లి పరిశీలించి పాతిన కడీలను తొలిగించారు. కడీలు తొలిగించారు కానీ, కబ్జాదారులపై చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా.. కబ్జాకు గురైన భూమిని గుర్తించామని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

కోహీర్, ఆగస్టు 13: తాగునీటి ఇబ్బందులను తీర్చాలని కోహీర్ పట్టణంలోని పట్నూర్ బేస్ కాలనీ ప్రజలు మంగళవారం పంచాయతీ కార్యదర్శి మహ్మద్ మిస్కీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది నుంచి తమకు తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్నూర్ బేస్ ప్రజలకు కాకుండా ఇక్కడ నుంచి గొల్లబండ ప్రాంతానికి నీటిని సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

అల్లం రైతులకు న్యాయం చేయాలి

అల్లం వ్యాపారులతో మాట్లాడుతున్న రైతులు

కోహీర్, ఆగస్టు 13: కేరళ నుంచి తీసుకువస్తున్న అల్లంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలు గ్రామాల అల్లం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జహీరాబాద్ డివిజన్‌లోని అల్లం సాగు చేస్తున్న రైతులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి అల్లం వ్యాపారులతో గిట్టుబాటు ధరపై చర్చించారు. పొలంలో కాల పరిమితి పూర్తి కాకముందే కేరళ రైతులు అల్లం పంటను ఇక్కడకు తీసుకువస్తున్నారని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా జహీరాబాద్ ప్రాంతంలో అల్లం పంటను సాగు చేస్తున్నామని, కేరళ అల్లం దిగుమతి నిలివేయాలని కోరారు. ఇక్కడి రైతుల నుంచి కొనుగోలు చేసిన తర్వాతనే కేరళ రైతులకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రామ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

క్వారీ, క్రషర్ ఏర్పాటుపై నిరసన

నిరసన తెలుపుతున్న రాళ్లకత్వ గ్రామస్తులు

జిన్నారం, ఆగస్టు 13: రాళ్లకత్వ గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేస్తున్న కంకర క్రషర్, క్వారీ వద్ద గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. క్వారీకి కేటాయించిన స్థలంలో మొండి కుంట, రాళ్ల కత్వ చెరువులోకి వచ్చే నీటి కాల్వ, ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యాం ఉన్నాయని తెలిపారు. చెరువులోకి నీళ్లు వచ్చే కాల్వను పూడ్చి వేయడంతో గ్రామస్తులు శాంతియుత నిరసన తెలిపారు. అసైన్డ్ భూముల్లో క్వారీ, క్రషర్‌లు ఏర్పాటు చేస్తున్నారని, కలెక్టర్ తక్షణమే చొరవ తీసుకొని పనులు నిలిపివేయాలని కోరారు. క్వారీ, క్రషర్ అనుమతులు రద్దు చేసే వరకు వెనుకడుగు వేయమని తేల్చిచెప్పారు.

రైతులు అధైర్య పడొద్దు

మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి

ఝరాసంగం, ఆగస్టు 13: అర్హతలున్నా రుణమాఫీ కాలేదని కొందరు రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయడంతో జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి మండల వ్యవసాయ అధికారి వెంకటేశంతో కలిసి మంగళవారం బర్దీపూర్ కెనరా బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్ ఖాతా నంబర్లలో తప్పులు, ఆధార్ వివరాలు సరిపోలక పోవటం, పంట రుణాలు రెన్యువల్ చేయకపోవటం వంటి వివిధ సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని బ్యాంక్ మేనేజర్ వివరించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు ఆధైర్య పడొద్దన్నారు. బర్దీపూర్ కెనరా బ్యాంక్ పరిధిలో రూ.5 కోట్ల రుణమాఫీ జరిగిందని, ఇప్పటికే రూ.3 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని బ్యాంక్ మేనేజర్ సృజన్ పేర్కొన్నారు.

బోగస్ ఓట్లను తొలిగించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జిన్నారం, ఆగస్టు 13: ఖాజీపల్లి పంచాయతీలో బోగస్ ఓట్లను తొలిగించాలని అఖిలపక్ష నాయకులు తహసీల్దార్ భిక్షపతిని కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఖాజీపల్లి అడ్రస్‌తో బొల్లారానికి చెందిన పలువురు ఓటు హక్కు కలిగి ఉన్నారని, సర్వేనంబర్ 181లోని జీఎంఆర్ కాలనీలో మలంపేట, ఎర్రగడ్డకు చెందిన వారి ఓట్లు ఉన్నాయని తహసీల్దార్‌కు రాతపూర్వకంగా తెలిపారు. ఇలాంటి వారితో గ్రామానికి తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు. తక్షణమే ఆధార్ లింకుతో విచారణ జరిపి ఖాజీపల్లి గ్రామానికి సంబంధం లేని వారి ఓట్లను తొలిగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ భార్గవ్, నాయకులు ఆకుల నవీన్‌కుమార్, శివశంకర్, రాము, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రంజోల్ గ్రామంలో సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోహీర్, ఆగస్టు13: సోయాబీన్ సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత అన్నారు. రంజోల్ గ్రామ రైతు రాజురెడ్డి పొలంలో సాగు చేస్తున్న ఆదిలాబాద్ -15 రకం సోయాబీన్ పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రకాలతో పోల్చితే ఆదిలాబాద్-15 రకం త్వరగా కోతకు వస్తుందని తెలిపారు. సోయాబీన్ కాయ, ధాన్యం పరిమాణం పెద్దగా ఉంటుందన్నారు. అనంతరం టమాట, క్యాబేజీ పంటను పరిశీలించారు. మామిడి రైతులు చెట్ల కొమ్మలను తప్పనిసరిగా కత్తిరించాలని సూచించారు. ఈ సందర్భంగా సాగులో తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏఈవో ప్రదీప్‌కుమార్, రైతులు రాజురెడ్డి, ఫిరోజ్, రాజు, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 13: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లకు పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. http//bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పరీక్ష రాసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని వివరించారు. బీసీలకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.50 పరీక్ష రుసుము ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా వి